సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం | 9 | మే | 2023



**చిలుకదుద్దు పండ్లు భలే రుచి**

రాజవొమ్మంగి: అటవీ ప్రాంతంలో లభ్యమయ్యే చిలుకదుద్దు పండ్ల సీజన్ ప్రారంభమైంది. ఎరుపు వర్ణంలో రుచిగా ఉంటాయి.



**రంగురాళ్ల క్వారీలపై ప్రత్యేక నిఘా**

రంగురాళ్లక్వారీల్లో తవ్వకాలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు అటవీశాఖ సీసీఎఫ్ శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి అన్నారు. 8లో



**మధ్యాత్మ ఆరాధనతో ధర్మస్థాపన**

మధ్యాత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని హిందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం అధ్యక్షుడు శేఖర్‌బాబు అన్నారు. 8లో

# కాసుల పంట కోతకు వేళాయే!

- మన్యంలో ముమ్మరంగా తునికాకు కోతలు
- సేకరణతో గ్రామాల్లో నందడి

**చింతూరు:** మన్యంలో గిరిజనులు వేసవి పంటగా భావించే తునికాకు (బీడీ ఆకు) సేకరణ ప్రస్తుతం ఏజెన్సీ వ్యాప్తంగా ముమ్మరంగా సాగుతోంది. విలీన మండలాలైన చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో తునికాకు కోతలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో నాణ్యమైన తునికాకు చింతూరు ఏజెన్సీలో లభ్యమవుతుంది. ఇక్కడి తునికాకును కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీ పడుతుంటారు.

**అతి నాణ్యమైన..**

చింతూరు డివిజన్‌లో ప్రధానంగా ఏడుగురాళ్లపల్లి యూనిట్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లభ్యం కాని అతి నాణ్యమైన తునికాకు లభిస్తుంది. ప్రతి ఏడాది ఈ యూనిట్‌లో అధికశాతం తునికాకు సేకరణ జరుగుతుంది. చింతూరు అటవీ డివిజన్‌లోని తొమ్మిది రేంజ్‌ల పరిధిలో తునికాకును సేకరిస్తారు. తునికాకు సేకరణ నిమిత్తం ప్రభుత్వం అటవీశాఖ ద్వారా స్టాండర్డు బ్యాగు ప్రాతిపదికన టెండర్లు నిర్వహిస్తుంది. ఆంధ్ర, తెలంగాణకు చెందిన వ్యాపారులు దీనిలో పాల్గొని టెండర్లు దక్కించుకుంటారు. యాభై తునికాకులు ఒక కట్టగా, వెయ్యి కట్టలను ఒక స్టాండర్డు బ్యాగుగా పరిగణిస్తారు.

**సేకరణ ఇలా..**

టెండర్లు దక్కించుకున్న వ్యాపారులు ఏప్రిల్ నెలలో తునికాకు మోడులను (ప్రూనింగ్) కొట్టిస్తారు. తద్వారా అడపా, దడపా కురిసే వర్షాలకు తునికాకు చెట్టు మంచి ఏపుగా పెరుగుతుంది. ఆకు ముదరగానే కోతలు ప్రారంభిస్తారు. తునికాకు సేకరణ అనేది ప్రతిరోజు నాలుగు విభాగాలుగా సాగుతుంది.

- ఇంటిల్లిపాదీ పిల్లల నుంచి పెద్దల వరకు ఉదయమే లేచి గ్రామ సమీపంలో వున్న తునికాకు చెట్ల వద్దకు చేరుకుని 10 గంటల వరకు ఆకులను సేకరిస్తారు. సేకరించిన ఆకులను బుట్టలు, దుస్తుల్లో సర్దుకుని వాటిని ఇళ్లకు మోసుకొస్తారు. మధ్యాహ్నం భోజనాలు ముగించుకుని ఇంటికి తీసుకొచ్చిన ఆకులను ఇంటిల్లిపాదీ కూర్చుని 50 ఆకుల కట్టలుగా కడతారు. అలా కట్టిన కట్టలను సాయంత్రం సమీపంలోని తునికాకు కల్లాలకు తీసుకెళ్లి అక్కడ అటవీ సిబ్బందికి అప్పగిస్తారు.



ఏజెన్సీలో తునికాకు సేకరణలో నిమగ్నమైన గిరిజనులు

- గిరిజనులు తెచ్చిన తునికాకు కట్టలను కల్లాల్లో బాగా ఆరబెట్టిన అనంతరం పెద్ద గన్నీబ్యాగుల్లో నింపి గోడౌనుకు తరలిస్తారు. తునికాకు సీజన్‌లో ఆకును సేకరించే వారితో పాటు గ్రామాల్లోని యువతకు కూడా ఉపాధి లభిస్తుంది.
- తునికాకు సీజన్‌లో ప్రతి కుటుంబం రోజుకు 500 కట్టల వరకు తునికాకును సేకరించడం ద్వారా ఒక్క రోజులో రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ఆదాయం పొందుతారు. తునికాకు సేకరణ జరిగే రోజుల్లో గిరిజన గ్రామాల్లో ఎంతో సందడి వాతావరణ నెలకొంటుంది.
- ఈ ఏడాది యాభై ఆకుల తునికాకు కట్టకు రూ.3 చెల్లించేలా ధర నిర్ణయించారు. కాగా గతంలో పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను ప్రభుత్వం చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు.



కల్లాలకు తునికాకు మూటలను తీసుకువెళ్తున్న గిరిజన మహిళలు



తునికాకును కట్టలుగా సిద్ధంచేస్తున్న కుటుంబ సభ్యులు

**సేకరణ లక్ష్యమిలా..**

| రేంజ్ | యూనిట్ పేరు | కల్లాల సంఖ్య | స్టాండర్డు బ్యాగుల లక్ష్యం |
|---|---|---|---|
| నెల్లిపాక | నెల్లిపాక | 38 | 1,200 |
| నెల్లిపాక | మాధవరావుపేట | 30 | 1,500 |
| కూనవరం | ఏడుగురాళ్లపల్లి | 49 | 3,500 |
| కూనవరం | కూనవరం | 24 | 1,400 |
| కూనవరం | మురుమూరు | 22 | 500 |
| వీఆర్‌పురం | వీఆర్‌పురం | 24 | 700 |
| చింతూరు | చింతూరు | 27 | 1,500 |
| చింతూరు | కుందులూరు | 30 | 1,000 |
| లక్కవరం | లక్కవరం | 17 | 1,200 |
| | మొత్తం | 261 | 12,500 |

**బోనస్ చెల్లింపునకు చర్యలు**

చింతూరు అటవీ డివిజన్ పరిధిలో తునికాకు కోతలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది లక్ష్యం సాధించేందుకు కృషి చేస్తున్నాం. కార్మికులకు రావాల్సిన బోనస్‌ను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– వి.సాయిబాబా, డీఎఫ్‌వో, చింతూరు

## 11న సీఎం జగన్ రాక

- వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం



**బీచ్‌రోడ్డు (విశాఖ):** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 11న విశాఖ నగరానికి రానున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 2.30 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో 3.20కు విశాఖ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అక్కడ హెలికాప్టర్‌లో 3.50 గంటలకు పీఎం పాలెం వైఎస్సార్ స్టేడియానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని అవిష్కరిస్తారు. స్థానిక నాయకులను కలిసి, కాసేపు మాట్లాడనున్నారు. సాయంత్రం 4.50 గంటలకు తిరిగి రోడ్డు మార్గంలో ఆరిలోవ అపోలో ఆస్పత్రికి చేరుకుని, అపోలో కేన్సర్ ఆస్పత్రిని ప్రారంభిస్తారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించాక, 5.35 గంటలకు బయలుదేరి బీచ్ రోడ్డు చేరుకుంటారు. అక్కడ వీఎంఆర్డీఏ అభివృద్ధి చేసిన సీ హారియర్ యుద్ధవిమాన మ్యూజియంను ప్రారంభిస్తారు. దీంతోపాటు అక్కడి నుంచే రామ్‌నగర్‌లోని వీఎంఆర్డీఏ కాంప్లెక్స్, ఎంవీపీలోని ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను ప్రారంభించనున్నారు. అనంతరం ఎండాడలోని కాపు భవనం, భీమిలిలోని ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుంచి 6.15 గంటలకు బయలుదేరి బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్లో జరుగుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబురావు కుమారుడు వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొంటారు. అనంతరం రాత్రి 7 గంటలకు తిరుగు ప్రయాణమై, విశాఖ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం బయల్దేరతారు. రాత్రి 8:20కి తాడేపల్లిలోని తన నివాసానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేరుకోనున్నారు.

## న్యూస్‌రీల్

### వంతెన నిర్మాణానికి వినతి



హెక్టాగుడ సమీపంలోని గెడ్డపై దెబ్బతిన్న కాలిబాట వంతెన

**అనంతగిరి:** మండలంలోని ఎగువశోభ పంచాయతీ హెక్టాగుడ గ్రామ సమీపంలోని దెబ్బతిన్న కాలిబాట వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ వంతెనను 2006లో సుమారు రూ.9 లక్షలతో నిర్మించారు. హుద్‌హుద్ తుపాన్‌లో ఈ వంతెన కొట్టుకుపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గెడ్డ పొంగినప్పుడల్లా దాటేందుకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### రంపచోడవరం డీఎల్పీవోగా రాఘవన్



పీవో సూరజ్ గనోరేను కలిసిన డీఎల్పీవో రాఘవన్

**రంపచోడవరం:** రంపచోడవరం డీఎల్పీవోగా జీఎల్ఎన్‌వీ రాఘవన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతు డివిజన్ పరిధిలోని గ్రామాల్లో పూర్తిస్థాయిలో పారిశుద్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భీమడోలు ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న ఆయనను పదోన్నతిపై రంపచోడవరం డీఎల్పీవోగా ప్రభుత్వం నియమించింది.

### క్రికెట్ టోర్నీ విజేత చింతూరు



చింతూరు జట్టు క్రీడాకారులు

**చింతూరు:** వీఆర్‌పురం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో చింతూరు జట్టు విజేతగా నిలిచింది. సుమారు 52 టీంలు పాల్గొన్న ఈ టోర్నమెంట్లో చింతూరు, వీఆర్‌పురం జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. సోమవారం జరిగిన ఫైనల్లో తొలుత బ్యాటింగ్‌చేసిన చింతూరు జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 109 పరుగులు చేసింది. 110 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన వీఆర్‌పురం జట్టు 10 ఓవర్లలో 49 పరుగులకే ఆలౌట్ కావడంతో 60 పరుగులతో చింతూరు జట్టు విజయం సాధించింది. విజేతగా నిలిచిన చింతూరు జట్టుకు ట్రోఫీతో పాటు రూ 30,116, వీఆర్‌పురం జట్టుకు రూ 20,116 నగదు బహుమతిని అందజేశారు.

### కానిస్టేబుల్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం



సత్యనారాయణ దొర కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న సీఐ బాజిలాల్

**రాజవొమ్మంగి:** స్థానిక పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కుంజం సత్యన్నారాయణదొర కుటుంబానికి బ్యాచ్ మేట్లు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణదొర గత ఏప్రిల్ 15వ తేదీన కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందడం తెలిసిందే. ఆయన మరణానికి చింతిస్తూ ఆయనతో పాటు కలసి పనిచేసిన 1990 బ్యాచ్ మేట్స్ అంతా ఆ కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు.ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ బాజిలాల్, రాజవొమ్మంగి ఎస్ఐ గోపీ నరేంద్రప్రసాద్, జడ్డంగి హెచ్‌సీ రాజారావు, స్పెషల్‌బ్రాంచ్‌కు చెందిన మహర్షి, దుర్గారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్‌బీకే సేవలపై విస్తృత ప్రచారం

- జిల్లా ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్ ఆదేశం

**సాక్షి,పాడేరు:** రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా అందిస్తున్న అన్ని సేవలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టి, గిరిజన రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా ప్రత్యేకాధికారి, ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన పాడేరు మండలంలో పర్యటించారు. ఆయనకు కలెక్టర్ సుమిత్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేశారు. మినుములూరు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ పౌర సేవలపై ఆరాతీశారు. పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయాల ద్వారా గిరిజనులకు సత్వరమే పౌర సేవలను పారదర్శకంగా అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం రైతులకు అమలుజేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను ఆర్‌బీకే కేంద్రాల ద్వారా పకడ్బందీగా అమలుచేయాలన్నారు. రైతుల వ్యవసాయాభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా వ్యవసాయశాఖ అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. అనంతరం మినుములూరు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోజువారి ఓపీ, అందిస్తున్న వైద్యసేవలు, మాతాశిశు ఆరోగ్యసేవలు, గర్భిణులు ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పరీక్షలపై ఇక్కడ వైద్యాధికారి, ఇతర సిబ్బందితో సమీక్షించారు,. మండలంలో గర్భిణులు, బాలింతల వివరాలు తెలుసుకున్నారు.



మినుములూరు పీహెచ్‌సీలో వైద్యబృందంతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్,పక్కన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్

గర్భిణులకు ప్రతినెలా వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. నూరుశాతం ప్రసవాలు ఆస్పత్రిలోనే జరిపి, తల్లీబిడ్డల సంక్షేమానికి కృషి చేయాలని, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్ వైద్యబృందాలను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్‌డీఏ పీడీ మురళి, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, వైద్యాధికారి ప్రవీణ్, తహసీల్దార్ త్రినాథరావు పాల్గొన్నారు.

# ముగ్గురు విద్యార్థులు సురక్షితం.. తల్లిదండ్రుల్లో ఆనందం

- నేడు స్వగ్రామాలకు చేరుకోనున్న 'మణిపూర్' విద్యార్థులు
- స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

**సాక్షి, పాడేరు:** ఉన్నత విద్య నిమిత్తం మణిపూర్ వెళ్లి అక్కడ జరుగుతున్న అల్లర్లలో చిక్కుకున్న జిల్లాలోని ముగ్గురు విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించింది. వారిని క్షేమంగా సురక్షిత ప్రాంతాలకు చేర్చడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలోని హుకుంపేటకు చెందిన కే.హేమంత్‌బాబు ఎన్ఐటీ, పాడేరుకు చెందిన అనిల్‌కుమార్, బి.సేలియంట్ జోయ్‌ఫర్(ట్రిపుల్ ఐటీ) మణిపూర్‌లో మొదటి సంవత్సరం చదువుతున్నారు. మణిపూర్‌లో కొద్దిరోజుల నుంచి జరుగుతున్న అల్లర్లు, కర్ఫ్యూ వల్ల ఆ విద్యార్థులతోపాటు స్థానికంగా ఉన్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈనేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ విద్యార్థుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఢిల్లీలోని ఆంధ్రాభవన్ అధికారులతో రెండు రోజులుగా నిరంతరం సమీక్షించారు. ముగ్గురు విద్యార్థులు యోగక్షేమాలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేయడంతో పాటు వారికి ధైర్యాన్నిచ్చారు. సమాచార పౌరసంబంధాల అధికారులు కూడా విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అక్కడి తెలుగు విద్యార్థులను ప్రత్యేక విమానంలో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మధ్యాహ్నం కోల్‌కతా చేర్చింది. వీరిలో జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. వీరు అక్కడి నుంచి హైదరాబాద్, మంగళవారం ఉదయానికి హుకుంపేట, పాడేరులోని నివాసాలకు చేరుకుంటారు. ఈ మేరకు ఏర్పాట్లను కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. సురక్షితంగా తమ పిల్లల ఇళ్లకు చేరుకోనుండటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందంతో ఉన్నారు.



కోల్‌కతా చేరుకున్న విద్యార్థులు హేమంత్‌బాబు, అనిల్‌కుమార్, సేలియంట్ జోయ్‌ఫర్

**తాగునీటి వనరులు విషతుల్యం**

అల్లర్లు ప్రారంభమైన నాటి నుంచి హాస్టల్‌లో బిక్కుబిక్కుమంటూ భయంగా గడిపాం. నీటి వనరులు విషతుల్యం చేయడంతో సురక్షిత తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డాం.సెక్యూరిటీ సిబ్బంది రక్షణతో వేరే ప్రాంతం నుంచి తాగునీరు తెచ్చుకుని కొద్దికొద్దిగా తాగేవాళ్లం. హాస్టల్‌లో నిత్యావసరాలు నిండుకోవడంతో రెండు పూటలు కొద్దికొద్దిగా తినేవాళ్లం. తుపాకుల పేలుళ్ల, బాంబుల మోతతో భయంగానే హాస్టల్‌లో గడిపాం.

– హేమంత్‌బాబు, హుకుంపేట విద్యార్థి

**భయం భయంగా గడిపాం**

తమ హాస్టల్ ప్రాంతంలో అల్లర్ల పరిస్థితి కొంత అదుపులోనే ఉన్నప్పటికీ బయటకు వెళ్లేందుకు భయంతో హాస్టల్‌లోనే క్షణక్షణం భయంగా జీవించాం. ఏ క్షణానికి ఏమి జరుగుతుందో అని భయపడేవాళ్లం.అల్లర్లతో భయపడుతున్న తమను ప్రత్యేక విమానాల్లో సురక్షిత ప్రాంతానికి తరలించి, ప్రాణాలు కాపాడిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి, అధికారులకు రుణపడి ఉంటాం. ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– పి.అనిల్‌కుమార్, బి.సేలియంట్ జోయ్‌ఫర్, పాడేరు విద్యార్థులు

# 25 నుంచి రెండో దశ భూముల రీసర్వే

- కలెక్టర్ సుమిత్‌కుమార్

**సాక్షి,పాడేరు:** జగనన్న శాశ్వత భూహక్కు,భూ రక్ష పథకానికి సంబంధించి జిల్లాలో రెండవ దశ భూముల రీసర్వేను ఈనెల 25వతేదీ నుంచి ప్రారంభిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. భూముల రీసర్వే, అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ, పీవీటీజీ ఓటర్ల నమోదు, ఫారం 6బి, ఫారం7 సేకరణపై సమీక్షించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఫారం 6బి సేకరణను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని, డీపట్టా భూముల సేకరణపై అసైన్డ్ కమిటీకి, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి నివేదించాలని ఆయన ఆదేశించారు, అసైన్డ్ భూముల పంపిణీకి పట్టాలు సిద్ధం చేయాలని, ఫైనల్ రికార్డ్స్ ఆఫ్ రైట్స్, ఫారం 13 నోటిఫికేషన్ జారీ, వెక్టరైజేషన్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు ఆయా పనులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తే ఆర్ఐ స్థాయిలో విచారణాధికారిని నియమించాలని సూచించారు.వంద గ్రామాల్లో ఫైనల్ ఆర్‌వోఆర్,142 గ్రామాల్లో ఫారం 13 నోటిఫికేషన్‌ను పూర్తి చేశారన్నారు. మిగిలిన గ్రామాల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్పందన సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్‌గనోరే,.అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

**24 గంటల్లో ఉపాధి పనుల కల్పన**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డుదారులందరికీ పనులు కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.అన్ని మండలాల ఎంపీడీవోలు, ఉపాధి హామీ పథకం అధికారులతో సోమవారం సాయంత్రం ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులకు ప్రతిపాదనలు అందజేస్తే 24గంటల్లో కొత్త పనులను మంజూరు చేస్తామన్నారు. ప్రతి రోజు జిల్లాలో లక్ష మందికి ఉపాధి పనులు కల్పించాలని, పనిదినాలు పెరగాలని ఆయన ఆదేశించారు. కొయ్యూరు మండలంలో సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ ప్రతిపాదించని ఎంపీడీవో,తహసీల్దార్లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.అలాగే ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి నమోదును వేగవంతం చేయాలన్నారు. అర్హులందరికీ రైతు భరోసా అమలుజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న సచివాలయ సిబ్బంది సర్వీస్ రిజిస్టర్లను తమకు పంపాలని ఆయన ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభం నుంచి వారం రోజుల్లోగా విద్యార్థులకు జేవీకే కిట్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు. పురుగులు మందులు, విత్తనాలు, ఎరువులు జల్లేందుకు అవసరమైన రూ.10 లక్షల విలువైన డ్రోన్లు 20శాతం సబ్సిడీతో పంపిణీకి రైతులను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో కొండలరావు, డ్వామా పీడీ రమేష్‌రామన్, జిల్లా వ్యవసాయాధికారి నందు, ఏపీడీ గిరి పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు పశువుల మృతి



కొత్తపల్లిలో మృతి చెందిన పశువులు



దేవరపల్లిలో పిడుగుపాటుకు చనిపోయిన ఆవు

**చింతూరు:** మండలంలోని కొత్తపల్లిలో ఆదివారం అర్ధ రాత్రి పిడుగుపడిన ఘటనలో ఐదు పశువులు మృతిచెందాయి. ఆదివారం రాత్రి భారీవర్షం కురుస్తున్న సమయంలో గ్రామంలోని బొద్దుల రంగయ్యకు చెందిన పశువులు తలదాచుకునేందుకు చెట్టు కిందకు వెళ్లాయి. ఈ క్రమంలో భారీ పిడుగు చెట్టుపై పడడంతో ఆ ధాటికి చెట్టుకింద ఉన్న ఐదు పశువులు మృతిచెందాయి. వీటికి మోతుగూడెం వెటర్నరీ సిబ్బంది సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు.

**మారేడుమిల్లి :** మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగుపడి మూడు మూగ జీవాలు మృతి చెందాయి. మండలంలోని సున్నంపాడు పంచాయితీ పరిధిలోని దేవరపల్లి గ్రామానికి చెందిన రైతు కొండ్ల బాలు రెడ్డికి చెందిన అవు, రెండు ఎద్దులు పిడుగు పాటు గురై ప్రాణాలు కోల్పోయాయి. అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కొండ్ల బాలురెడ్డి కోరారు.

**దెబ్బతిన్న ముగ్గురి పెంకుటిళ్లు**

**పెదబయలు:** మండలంలోని సోమవారం భారీ వర్షం కురిసింది.గంపరాయి పంచాయతీ అల్లంపుట్టు గ్రామంలో ఉల్లి లక్ష్మయ్య, తాంగుల మోహన్‌రావు, డుంబేరి సుబ్బారావుకు చెందిన పెంకుటిళ్లు దెబ్బతిన్నాయి.ఇంటి వెనుకభాగంలో ఉన్న రాతి గట్టు, మట్టి జారిపడింది. దీంతో ఇళ్ల గోడలు, పైకప్పులు దెబ్బతిన్నాయని వారు వాపోయారు. ప్రభుత్వానికి ఆదుకోవాలని వారు కోరారు. ఇంట్లో ఉన్న ధాన్యం, రాగులు, ఇతర వస్తువులు వర్షానికి తడిచిపోయాయని వారు వివరించారు. సర్పంచ్ బొరగం మత్స్యమ్మ, మాజీ సర్పంచ్ వంతాల కమలాకర్, నేతలు బొరగం అప్పారావు, బీజేపీ నాయకులు కురుసా ఉమామహేశ్వరరావు, తాగుల సత్యవతి, మాజీ ఎంపీటీసీ కమలాకర్, వీఆర్వో రత్నకుమారి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.



అల్లంపుట్టులో రాతి, మట్టి గట్టు జారిపడటంతో దెబ్బతిన్న ఇళ్లు

# సమస్యల పరిష్కారానికి కృషి

- జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

**ఎటపాక:** మండలంలోని పురుషోత్తపట్నంలో గల దేవస్థానం భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన ఎటపాక తహసీల్దార్ కార్యాలయంలో భద్రాచలం దేవస్థానం అధికారులు, స్థానిక అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూములకు సంబంధించిన వివాదాలు, సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దేవస్థానం నుంచి భూములు లీజుకు తీసుకుని సాగు చేసుకుంటున్నామని, వీటికి విద్యుత్, రహదారి సౌకర్యం, ప్రభుత్వం నుంచి లభించే పథకాలకు అర్హత పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో రమాదేవి, తహసీల్దార్ వేణుగోపాల్, రైతులు పాల్గొన్నారు.

# పేదలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ

**వై.రామవరం:** సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సిఆర్‌పిఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. వారపు సంతకు, మరోపక్క ప్రభుత్వ కార్యాలయాల పనులపై వచ్చిన సుమారు 195 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎంఎల్ నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు 'జగనన్నకు చెబుదాం' ప్రారంభం

సాక్షి,పాడేరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం 10.30 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.జిల్లా అధికారులు కలెక్టరేట్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

### వివాహిత అదృశ్యం

చీడికాడ: అర్జునగిరి గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పి. రామారావు సోమవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం... పెంటకోట గంగునాయుడు భార్య లక్ష్మి (38) ఈ నెల 4న ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి కళ్లానికి వెళ్తున్నానని చెప్పి కనిపించకుండా పోయింది. బంధువులు, స్నేహితులు వెతికినా కనిపించకపోవడంతో శనివారం భర్త గంగునాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమె ఆచూకీ తెలిస్తే 9440904210 సమాచారం అందజేయాలని ఎస్‌ఐ తెలిపారు.

### రంగురాళ్ల క్వారీలపై ప్రత్యేక నిఘా

- అటవీశాఖ సీసీఎఫ్ శ్రీకాంత్‌నాథ్ రెడ్డి

గూడెంకొత్తవీధి: రంగురాళ్లక్వారీల్లో తవ్వకాలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు అటవీశాఖ సీసీఎఫ్ శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం గూడెంకొత్తవీధి మండలంలోని సిగనాపల్లి, గుర్రాలగొంది అటవీ ప్రాంతాల్లో రంగురాళ్ల క్వారీలను తనిఖీ చేశారు. క్వారీల్లో ఇటీవల కాలంలో అక్రమంగా రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయంటూ జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఈక్వారీని తనిఖీ చేసినట్టు తెలిపారు. అటవీశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇక్కడ ప్రత్యేకంగా బేస్ క్యాంపులను కొనసాగిస్తామన్నారు. అనంతరం క్వారీ పరిసర గ్రామాలకు చెందిన గిరిజనులతో సమావేశం అయ్యారు. అడవుల సంరక్షణలో గ్రామస్తులు తమ శాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌ఓలు సూర్యనారాయణ, శ్యాంసుందర్, రేంజి అధికారి జగదీష్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



# సైబర్ కేటుగాళ్లు..!



నాతవరం మండలం ములగపూడి గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ ఇ.రాజేశ్వరికి ఇటీవల ఓ ఫోన్ కాల్ వచ్చింది. అమరావతి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని, మీ పరిధిలో అమ్మ ఒడి లబ్ధి అందని వారి వివరాలు, ఫోన్ నంబర్ చెప్పమని అడిగారు. సాంకేతిక కారణాల వల్ల ఆ పథకం సొమ్ము అందని విద్యార్థి తల్లిదండ్రులు గ్రంథి భాగ్యలక్ష్మి, రవికుమార్ వివరాలు ఆమె చెప్పారు. వారిని, వలంటీర్‌ను టెలీ కాన్ఫరెన్స్‌లో కలిపి, రెండు నిమిషాల తర్వాత వలంటీర్ కాల్ కట్ చేసి భాగ్యలక్ష్మి, రవికుమార్లతో సంభాషణ కొనసాగించారు. ముందు భాగ్యలక్ష్మి బ్యాంక్ ఖాతా వివరాలు అడిగారు. ఎందుకైనా మంచిది.. మీ భర్త రవికుమార్ బ్యాంక్ ఖాతా వివరాలు సైతం ఇవ్వాలని అడిగారు. కొద్దిసేపటి తరవాత వారిద్దరి ఫోన్లకు రెండు లింక్‌లు వచ్చాయి. మోసగాళ్లు పంపిన ఈ లింక్‌లు క్లిక్ చేయగానే భాగ్యలక్ష్మి ఖాతా నుంచి రూ.9 వేలు, రవికుమార్ ఖాతా నుంచి రూ.4 వేలు మొత్తం రూ.13 వేలు కట్ అయ్యాయి.

అచ్యుతాపురం మండలం కొండకర్ల ఉన్నత పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ టీచర్ అవధూతల రాము కుమారుడికి అమ్మ ఒడి పెండింగ్‌లో ఉంది. వలంటీర్‌కి కాల్ చేసి రాముతో మాట్లాడి.. పథకం కింద నగదును అందిస్తామని బ్యాంకు, ఏటీఎం కార్డు వివరాలను పంపించాలని కోరారు. బ్యాంకు వివరాలను పంపించడంతో పాటు మొబైల్ ఫోన్‌కు వచ్చే లింక్‌లను ఓకే చేయాలని సూచించారు. చెప్పిన విధంగానే బ్యాంకు ఖాతాల నుంచి రూ.2 వేలు చొప్పున రెండుసార్లు మొత్తం రూ.4 వేలు మాయమయ్యాయి.

హరిపాలేనికి చెందిన గణేష్‌కు కూడా ఇదేవిధంగా ఫోన్ కాల్ వచ్చినా ఆయన అనుమానంతో సచివాలయ ఉద్యోగులను సంప్రదించారు. ఇది ఫేక్ అని చెప్పడంతో మోసపోకుండా బయటపడ్డారు. నవరత్నాల పథకాల ద్వారా లబ్ధి అందని వారి వివరాలను సేకరించి సైబర్ నేరగాళ్లు ఇలా మోసం చేస్తున్నారు.

- నవరత్నాల స్కీంలో పెండింగ్‌లో ఉన్న వారే టార్గెట్
- గ్రామీణ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు
- నాలుగు నెలల వ్యవధిలో 11 కేసులు నమోదు
- పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు

సాక్షి, అనకాపల్లి: సైబర్ నేరగాళ్లు గ్రామీణ ప్రజలను టార్గెట్ చేస్తున్నారు. ముఖ్యంగా నవరత్నాల పథకాల లబ్ధిదారులపై దృష్టి పెట్టారు. వివిధ కారణాల వల్ల ఇంకా లబ్ధి అందుకోని వారి వివరాలు సేకరించి, వారికి ఫోన్లు చేసి, బ్యాంకు అకౌంట్ నంబర్ అడుగుతున్నారు. వారి ఫోన్‌కు లింక్ పంపిస్తున్నారు. పథకం ఇంకా అందలేదన్న ఆతృతలో లబ్ధిదారులు వెనుక ముందు ఆలోచించకుండా లింక్‌పై క్లిక్ చేయగానే వారి అకౌంట్ నుంచి సొమ్ము మాయమవుతోంది. సైబర్ కేటుగాళ్లు ఈ కొత్త రూటును ఎంచుకోవడంతో లబ్ధిదారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. ఇటీవల నాతవరం, అచ్యుతాపురం, పరవాడ, నర్సీపట్నం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇలాంటి కేసులు వెలుగుచూశాయి. నాలుగు నెలల వ్యవధిలో సంక్షేమ పథకాలు, క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్, బ్యాంక్ ఫ్రాడ్‌లకు పాల్పడిన కేసులు 11 వరకు నమోదయ్యాయి. సైబర్ క్రైమ్ వలన ఎందరో అమాయక ప్రజలు, యువత మోసపోతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏటీఎం పిన్, ఆధార్ నంబర్లు అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి తరహా ఆర్థిక మోసాలకు గురైతే తక్షణమే 1930 నంబరుకు కాల్ చేయాలని జిల్లా పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

**'లోకల్' సైబర్ నేరగాళ్ల పనా..!**

ప్రభుత్వ స్కీంల పేరిట ఇటీవల జరిగిన సైబర్ నేరాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఎస్పీ మురళీకృష్ణ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. గ్రామీణ ప్రాంత వలంటీర్ల నంబర్లు సైబర్ నేరగాళ్లకు ఎలా వచ్చాయి.. సంబంధిత వలంటీర్ పరిధిలో ప్రభుత్వ స్కీంలు పెండింగ్‌లో ఉన్నవారి డేటా వారు ఎలా తస్కరించారు.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇటువంటి తరహా మోసాలు జిల్లాలో ఇంకెక్కడైనా జరిగాయా? మోసపోయినా పోలీసులకు చెప్పని వారెవరైనా ఉన్నారా...? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. ఇందులో లోకల్ నేరగాళ్ల ప్రమేయం ఉందా.. అనే కోణంలో విచారిస్తున్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా కూడా ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నాలు పోలీసులు చేపడుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో పోలీసు ప్రచార వాహనాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

### పోలీసుల సూచనలు...

- మీ బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు లావాదేవీలన్నింటితో ఇ-మెయిల్, మొబైల్ అలెర్ట్ అనుసంధానం చేసుకోవాలి
- అపరిచిత వ్యక్తులతో బ్యాంక్, ఆధార్ ఇతర వివరాలు పంచుకోవద్దు. బ్యాంకులు, బీమా కంపెనీలు ఇ-మెయిల్ ద్వారా వ్యక్తిగత సమాచారం అడగవు.
- పొరపాటున మీ ఫోన్ పే, గూగుల్ పే ఖాతాలో డబ్బులు వేశామని, వాటిని వెనక్కి పంపండి.. అని ఎవరైనా కాల్ చేసినట్లయితే వారికి తిరిగి డబ్బులు పంపవద్దు
- గూగుల్ సెర్చ్‌లో కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతుకుతున్నప్పుడు నకిలీ వెబ్‌సైట్లు ఉంటాయి జాగ్రత్త
- ఆన్‌లైన్ గేమింగ్, క్రికెట్ బెట్టింగ్‌ల పేరిట అత్యాశకు పోయి.. అప్పుల్లో మునిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువతను గమనించి తల్లిదండ్రులు దారిలో పెట్టాలి
- ఆన్‌లైన్ డేటింగ్ యాప్స్ పేరిట బ్లాక్‌మెయిల్ చేసి నేరాలకు పాల్పడతారు. సోషల్ మీడియాలో ట్రాప్ చేయడానికి గిఫ్ట్‌స్ కూడా పంపించే అవకాశాలున్నాయి. డేటింగ్ సైట్లు, డేటింగ్ యాప్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి



### మోసపోతే తక్షణమే ఫిర్యాదు చేయండి



వలంటీర్ల డేటాను కూడా సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తున్నారు. వలంటీర్ల నంబర్ల ద్వారా గ్రామాల్లో నవరత్నాల పథకాల పేరిట సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. అలాంటి కాల్స్ వస్తే అప్రమత్తంగా ఉండండి. వారికి బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వవద్దు. ఒకవేళ ఏదైనా సైబర్ మోసానికి గురైనట్టు అనుమానం కలిగితే 1930కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చు. బ్యాంకు లావాదేవీల్లో మోసపోతే వెంటనే హోం బ్రాంచ్‌ను సంప్రదించాలి. మోసపోయిన వెంటనే బాధితులు సమీప పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయాలి.

– కె.వి.మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ

## తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య

ఎస్.రాయవరం: తల్లి మందలించిందని ఓ యువతి ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకుని సోమవారం మృతి చెందింది. ఎస్‌ఐ పి.ప్రసాద్‌రావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గుడివాడ శివారు కొత్తపోలవరం గ్రామానికి చెందిన బత్తిన దుర్గ (17) ఇంటి వద్ద తల్లితో ఘర్షణ పడింది. ఈ క్రమంలో తల్లి మందలించిందని మనస్తాపం చెందిన దుర్గ ఇంట్లో ఫ్యానుకి ఉరి బిగించుకుని అపస్మారక స్థితిలోనికి చేరుకుంది. ఆరు బయట ఉన్న కుటుంబ సభ్యులు దుర్గను వెంటనే నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారని చెప్పారు. మృతి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉందని, వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

## మధ్యాత్మ ఆరాధనతో ధర్మస్థాపన

రంపచోడవరం : జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరం తెలుసుకోవడం ద్వారా మధ్యాత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని, అదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశ్యమని హిందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం అధ్యక్షుడు శేఖర్‌బాబు అన్నారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల అనుగ్రహంతో రంపచోడవరం, సీతపల్లి, గోపవరం, పోక్సుపేట, దిరిసినపల్లి, గ్రామాల్లో త్రైత సిద్ధాంతం, భగవద్గీత ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపడానికి, ప్రజల్లో ఉన్న అసమానతలను తొలగించడానికి, సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజల్లో దైవ భక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శాంత రాజు, లోహిత, అన్నవరం, శ్రీను పాల్గొన్నారు.

## పోస్టల్ ఆన్‌లైన్ సేవలకు అంతరాయం

- ఇంటర్నెట్ పనిచేయక తిప్పలు
- నాలుగు రోజులుగా స్తంభించిన నగదు లావాదేవీలు

అడ్డతీగల : ఇంటర్నెట్ పనిచేయక అడ్డతీగల సబ్ పోస్టాఫీసులో అన్ని రకాల సేవలు నిలిచిపోయాయి. నాలుగు రోజులుగా ఇదే తీరుగా ఉండడంతో నగదు లావాదేవీలు స్తంభించిపోయాయి. అడపా దడపా కురుస్తున్న అకాల వర్షాలకు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల ఇలా జరుగుతుందంటున్నారు. నాలుగు రోజుల ఇలా ఇంటర్నెట్ సేవల్లో అంతరాయం కారణంగా ఆన్‌లైన్ కార్యకలాపాలు ఎక్కడికక్కడ నిలిచిపోయిన నేపథ్యంలో జనం అవస్థలు పడుతున్నారు. 22 పంచాయతీల్లోని బ్రాంచి పోస్టాఫీసులకు ప్రధాన కేంద్రంగా అడ్డతీగల సబ్‌పోస్టాఫీసు ఉంది. రికరింగ్ డిపాజిట్లు, సుకన్య సమృద్ధితో పాటు ఇందిరా వికాస పత్రాలు, పోస్టల్ ఇన్సూరెన్స్‌లు, ఇతర పోస్టల్ సేవింగ్ స్కీములు, కాలం తీరిన వివిధ డిపాజిట్లు క్లోజ్ చేసుకోవాలన్నా ఏ విధంగానూ వీలుకాకపోవడంతో పోస్టల్ వినియోగదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించకపోవడం వల్ల సమస్య ఎదురైందని పోస్టల్ సిబ్బంది చెబుతున్నారు. లైన్లు దెబ్బతినడంతో పాటు స్థానిక బీఎస్ఎన్ఎల్ ఎక్స్చేంజ్‌లో మోడెం సైతం పాడైనట్టు వాటిని మరమ్మతులు చేస్తేనే సేవలు పునరుద్ధరణ జరుగుతుందని భావిస్తున్నారు. ఇక్కడ సేవలు అందకపోవడంతో గంగవరం, రంపచోడవరం, ఏలేశ్వరం మండలాలకు వెళ్లి ఆన్‌లైన్ సేవలు వినియోగించుకోవాలని పోస్టల్ సిబ్బంది వినియోగదారులకు సూచిస్తున్నారు. వెంటనే ఇంటర్నెట్ సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఆన్‌లైన్ కార్యకలాపాలు నిలిచిపోయిన అడ్డతీగల సబ్‌పోస్టాఫీసు

## స్పందన సమస్యల సత్వర పరిష్కారం

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే
- 37 వినతులు స్వీకరణ

రంపచోడవరం: స్పందనలో అర్జీలను సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అన్నారు.స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో సుమారు 37 అర్జీలను స్వీకరించారు.

చావటికోట పంచాయతీలో మధ్యలో నిలిచిపోయిన గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని సర్పంచ్ సాదల ప్రేమ్‌కుమార్‌రెడ్డి అర్జీ అందజేశారు. అడ్డతీగల మండలం వడిసకర్ర గ్రామంలో భూ సమస్యలు పరిష్కరించాలని కొండబాబు అనే వ్యక్తి అర్జీ అందజేశారు. రంపచోడవరం మండలం కన్నారం గ్రామంలో 50 ఎకరాలకు నీరందించేందుకు పోతురాజు చెరువుకు మరమ్మతులు చేపట్టాలని మడకం బాపిరాజు అనే రైతు కోరారు. ఆకూరు గ్రామంలో రైతులు రబ్బరు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని మడి మురళీకృష్ణదొర, అరగాటి సుగ్గిరెడ్డిలు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు, పీహెచ్‌వో కె.చిట్టిబాబు, పీఏవో రాంబాబు, సీడీపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్‌గనోరే

## ఆదిత్య విద్యాసంస్థలకు రెడ్‌క్రాస్ పురస్కారం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సేవలకు గుర్తింపుగా ఆదిత్య విద్యాసంస్థలను రెడ్‌క్రాస్ పురస్కారం వరించింది. విజయవాడ రాజ్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డికి అందజేశారు. టర్కీ, సిరియాలలో సంభవించిన భూ కంప సమయంలో ఆదిత్య విద్యాసంస్థలు సమకూర్చిన రూ.48 లక్షల విరాళం రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా అప్పట్లో అందజేశారు. అత్యధికంగా 2,200 మంది రక్తదానం చేశారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా 13మందికి పురస్కారాలు అందజేయగా కాకినాడ నుంచి ఆదిత్యకు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుగుణారెడ్డిను విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.



సుగుణారెడ్డికి పురస్కారం అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

## గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

దేవరాపల్లి : పాడేరు నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒక బాలుడితో పాటు ఇద్దరు యువకులను సోమవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు. శ్రీరాంపురం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ముగ్గురిని అనుమానంతో అదుపులోకి తీసుకుని సోదాలు నిర్వహించగా 8 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. ఈ ఘటనలో విశాఖ ఎంవీపీ కాలనీకి చెందిన విజయశివ భార్గవరెడ్డి, గుజ్జు రాము, కోరాపుట్ జిల్లా పాడువ మండలం దార్లపూడి గ్రామానికి చెందిన పదహారేళ్ల బాలుడు ఉన్నారన్నారు. వారిని అరెస్టు చేసి చోడవరం కోర్టులో హాజరు పరచామని ఎస్‌ఐ చెప్పారు.

# సీ.. వాహ్‌రియర్!

**యుద్ధ విమానంలో విహరించే అనుభూతి వర్ణనాతీతం. ఆ అవకాశం దేశాధినేతలకే లభ్యం. అదే అనుభూతి పర్యాటకులకూ అందుబాటులోకి రానుంది. అయితే గగనతలంలో కాదు సుమా..! నిజంగా ఆకాశ మార్గంలోనే విహరిస్తున్నాం.. అనే సంభ్రమాశ్చర్యాలకు గురిచేసేలా.. వేలాడదీసిన సీ హారియర్ యుద్ధవిమానం పర్యాటకుల్ని మరో లోకానికి తీసుకెళ్లనుంది. ఈ నెల 11న సీఎం చేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.**

- తూర్పు తీరానికి మరో ఆభరణం.. సీ హారియర్ మ్యూజియం
- రూ.7.50 కోట్లతో యుద్ధ విమాన మ్యూజియం పనులు పూర్తి
- రాజీవ్ స్మృతి భవన్‌లో తుది మెరుగులు
- గోవా నుంచి సీ హారియర్ సిమ్యులేటర్
- సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు

దొండపర్తి(విశాఖ దక్షిణ) : సుందర సాగరతీరంతో పర్యాటకులను మంత్ర ముగ్ధుల్ని చేస్తున్న విశాఖ సిగలో మరో మణిహారం చేరనుంది. యుద్ధ సమయంలో గగనతలాన్ని గడగడలాడిస్తూ.. గాల్లో దూసుకుపోయిన సీ హారియర్ యుద్ధ విమానం మ్యూజియంగా సందర్శకుల్ని కనువిందు చేయనుంది. విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సరికొత్త ప్రణాళికలతో వీఎంఆర్‌డీఏ సిద్ధమవుతోంది. ప్రధానంగా బీచ్ రోడ్డులో మరిన్ని హంగుల్ని చేర్చుతోంది. అందులో భాగంగానే నౌకాదళంలో 32 ఏళ్ల పాటు సేవలందించి నిష్క్రమించిన సీ హారియర్ యుద్ధ విమానం.. మ్యూజియంగా మారి ప్రారంభానికి సిద్ధమైంది.

**సీ హారియర్ విశిష్టత**

1983లో బ్రిటిష్ ఏరోస్పేస్ నుంచి కొనుగోలు చేసిన ఈ సీ హారియర్ యుద్ధ విమానం నౌకాదళ ఏవియేషన్ విభాగంలో చేరింది. గోవాలోని ఐఎన్ఎస్ హంస యుద్ధ నౌకపై 32 ఏళ్ల పాటు దేశానికి సేవలందించింది. 2016లో సేవల నుంచి నిష్క్రమించింది. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో వీఎంఆర్‌డీఏ ఈ యుద్ధ విమానాన్ని సాగరతీరంలో మ్యూజియంగా తీర్చిదిద్దుతోంది. విశాఖ సాగరతీరానికి అదనపు ఆభరణంలా ఇప్పుడు సీ హారియర్ యుద్ధ విమానం అందుబాటులోకి రానుంది.

**రూ.7.5 కోట్లతో మ్యూజియం**

బీచ్ రోడ్డు రాజీవ్ స్మృతి భవన్‌లో రూ.7.5 కోట్లతో సీ హారియర్ యుద్ధ విమాన మ్యూజియం పనులను వీఎంఆర్‌డీఏ చేపట్టింది. హైడ్రాలిక్ క్రేన్ సహాయంతో జీ ప్లస్ టూ బిల్డింగ్‌లో సీ హారియర్‌ని వేలాడదీశారు. దీని విశిష్టతతో పాటు పర్యాటకులకు నిజమైన యుద్ధ విమానంలో ప్రయాణించే అనుభూతి కలిగేలా ఈ మ్యూజియంను తీర్చిదిద్దుతున్నారు. ఇందులో సిమ్యులేటర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అలాగే నావికాదళానికి, ఎయిర్‌క్రాఫ్ట్‌కు సంబంధించి విశేషాలతో కూడిన చిత్రాలను కూడా ప్రదర్శించనున్నారు. ఇప్పటికే సాగరతీరంలో టీయూ-142 ఎయిర్‌క్రాఫ్ట్ సందర్శకులను ఎంతగానో అలరిస్తోంది. కురుసుర జలాంతర్గామి సందర్శకుల మనసు దోచుకుంటోంది. మరికొద్ది రోజుల్లోనే ఈ సీ హారియర్ మ్యూజియం కూడా అదనపు ఆకర్షణగా నిలవనుంది.



సీహారియర్ మ్యూజియం



డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన లాక్ష్యా మిసైల్ నమూనా

**గోవా నుంచి ట్రైనింగ్ సిమ్యులేటర్**

సీ హారియర్ మ్యూజియంలో వివిధ రకాల యుద్ధ విమానాల గురించి తెలుసుకునేలా సమగ్ర సమాచారంతో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. వీటికి తోడుగా.. ఇంటిగ్రేటెడ్ మ్యూజియంలో విభిన్న హంగులు.. కొత్త అనుభూతిని అందివ్వనున్నాయి. సీ హారియర్ ఎయిర్‌క్రాఫ్టని నడిపేందుకు ముందుగా శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణని నేరుగా ఎయిర్‌క్రాఫ్ట్‌లో కాకుండా దాని సిమ్యులేటర్ ద్వారా ఇవ్వనున్నారు. గోవాలోని ఐఎన్ఎస్ హంసా నేవల్‌బేస్‌లో ఉన్న ట్రైనింగ్ సిమ్యులేటర్‌ని విశాఖకు తీసుకొచ్చారు. కొచ్చి నేవల్ స్టేషన్‌లో ఉన్న విడిభాగాల్ని కూడా రప్పించారు. ఇవి ఈ మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

### సీఎంతో ప్రారంభోత్సవానికి సన్నాహాలు



సీ హారియర్ మ్యూజియం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మ్యూజియం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మ్యూజియంని సందర్శించడంతో పాటు, ఆ జ్ఞాపకాలు సందర్శకులకు గుర్తుండిపోయేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ ఎ.మల్లికార్జున, జిల్లా కలెక్టర్, వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జ్ కమిషనర్